# అదీకథ

గోపాలం ప్లాట్‌ఫారంపై అడుగుపెట్టేసరికి పదకొండు గంటల పైన నలభై నిముషాలయింది. బయట ఎండ తీవ్రంగా వుంది. పైగా టైమైపోతోందని ఆదారాబాదరాగా వచ్చేడేమో చెమటలతో వొళ్ళు చిత్తడి చిత్తడిగా వుంది. తీరా చూస్తేఅతడెక్కవలసిన రైలు గంటన్నర లేటు. ప్రాణం వుసూరనిపించింది. ఈ మాట ముందే తెల్సుంటే ఆటోవాడికి మీటరుకన్నా ఎక్కువ సమర్పించుకున్న అయిదు రూపాయలు మిగిలేవి కదా అనుకున్నాడు. వెంటనే మనస్సులో రైల్వేవారిని, ఆటోవాళ్ళని, శంకరం బాబాయిని, చివరగా ఇన్నాళ్ళు బ్రహ్మచారిగా వుండి పోయిన తనని గూడా వేడి వేడి తిట్లతో ఆడిపోసుకున్నాడు.

గోపాలానికి ముప్ఫయ్యవ సంవత్సరం వచ్చి వారం రోజులే అయింది. కాని పెళ్ళిచూపుల కార్యక్రమం గత అయిదేళ్ళుగా సాగుతోంది. ఇప్పటికి నిన్న చూసిన శంకరం బాబాయి వాళ్ళ ఆఫీసులో పన్జేసే వాళ్ళమ్మాయితో సహా ఎనభై రెండు మంది ఆడపిల్లల్ని చూట్టం జరిగింది. కాని వొక్కళ్ళు కంట్లో దూరటం జరగలేదు. వుద్యోగం వుంటే అందం వుండదు. అందం వుంటే చదువుండదు. చదువు, ఉద్యోగం వుంటే ఆ సంబంధాలు గోపాలం వరకు రావటం లేదు... పోనీ అలాంటి సంబంధాల అడ్రస్సు కనుక్కుని తనే ఎప్రోచ్ అవగా సదరు ఆడకూతుళ్ళు నువ్వెంతన్నట్లుగా చూడటమే కాకుండా అలాగే మాట్లాడుతున్నారు కూడా. అసలే గోపాలానికి గడుసు పిల్లలంటే చచ్చేంత భయం. అంచేత సెల్ఫ్ ట్రయల్సుకి స్వస్తి చెప్పి ఆ బాధ్యతని శంకరం బాబాయికి, నాగభూషణం బావకి, సుబ్రమణ్యం తండ్రికి అంటే అతడ

తండ్రికి అప్పచెప్పాడు. వాళ్ళేమో అంతేచాలని, అదేపనిగా నడుంకి గుడ్డ బిగించి నక్సలైట్ల కోసం పోలీసులు తిరిగినట్లు ఆడపిల్లల కోసం ఆంధ్రదేశమంతా గాలించేస్తున్నారు. ఫలితంగా రెండ్రోజులకో వుత్తరం ఏదో మూలనించి వస్తుంది– పిల్ల బావుంది. చదువుకుంది, సాంప్రదాయ బంగారం– వెంటనే బయల్దేరి రా! అంటూ గోపాలం ఆదరా బాదరాగా వెళ్తాడు. తీరా చూస్తే, పిల్ల బావుండదు– సాంప్రదాయం అంతకన్నా బావుండదు. పోనీ చదువు? అల–వల–తల. తాత పిలక– ఇదీవరస. వుత్తరం రాసిన పెద్ద మనిషిని నిలదీసి అడిగితే అన్నీ నాకు నచ్చేయి– నీకు నచ్చకపోతే నేనేం చేసేది?–ఇదీ జవాబు.

గోపాలానికి నెల తిరిగేసరికి ప్రయాణపు ఖర్చులకో సగం జీతం హరించుకుపోతోంది. అంచేత ప్రయాణాలయితే మాన్లేదుగాని, కట్నం రేటు పెంచేస్తున్నాడు. ఈ వేటలో ఓ భాగంగానే మూడ్రోజుల క్రితం శంకరం బాబాయి ఉత్తరం రాసేడు. వాళ్ళ ఆఫీసులో పన్జేసే ఓ ఆఫీసరుగారి కూతురట. పిల్ల బంగారపు బొమ్మట. గుణం వజ్రంట. (ఆ సంగతి బాబాయి కెట్లా తెల్సో) కట్నం బాగా ఇచ్చే పార్టీట. చదువు గురించి మిగతా వివరాలు రాయకుండా వెంటనే వస్తే మంచిది. నాన్నకి అమ్మక్కూడా వ్రాస్తున్నాను. కాబట్టి వుత్తరం చూడగానే బయల్దేరు అంటూ వ్రాసి, 'నౌ ఆర్ నెవ్వర్' అనే స్లోగన్‌తో ముగించేశాడు.

ఇంత అనుభవం వున్న గోపాలం కూడా స్లోగన్స్ చదివి సోలయిపోయి. సంచీ వొకటి భుజాన వేసుకుని రైలెక్కి కూర్చున్నాడు.

తీరా చూస్తే పిల్ల బంగారం రంగే కానీ, ముందు పళ్ళు తోసుకొచ్చి సొరగింజల్లాగా తళతళలాడే తెలుపుతో ప్రకాశిస్తున్నాయి. అక్కడికీ పోన్లే ముందుపళ్ళు ముందుకిరాక వెనక్కెడతాయవి సర్దిచెప్పుకుందావనుకుంటే కాస్త మెల్లగూడా వుందేమో నన్న శంక కూడా మొదలవటంతో గోపాలానికి వుత్సాహం తగ్గింది. పైగా శంకరం బాబాయి తన పెళ్ళి ఈ పిల్లతో చేయించి తనేమో ప్రమోషన్ కొట్టేస్తాడని, అసలందుకే ఈ సంబంధంపై ఇంత వుత్సాహం, ఆసక్తి చూపిస్తున్నాడని పసిగట్టిన క్షణం వుత్సాహం పూర్తిగా పోయింది. దాంతో బొమ్మలాగా కూర్చుని ముభావంగా బయటికొచ్చేశాడు. రాత్రి భోజనాలయ్యాక డాబాపైన పిన్నికి తెలీకుండా ఇద్దరూ సిగరెట్లు తాగుతుంటే బాబాయి అడిగేడు– ఎలా వుందిరా పిల్లంటూ గోపాలం ఆకాశం వంక చూసి నూటముప్ఫైరెండు నక్షత్రాలని లెక్కపెట్టి, ఇహ బావుండదని చెప్పేశాడు– "నువు చెప్పినంత గొప్ప సంబంధం కానట్టే వుంది బాబాయ్" అంటూ

శంకరం బాబాయికి చచ్చేటంత కోసం వచ్చింది. ఇంతెత్తు ఎగిరి ఎన్నో మాటలన్నాడు. అవన్నీ ఇప్పుడనవసరం. కాని డాబాదిగి వెళ్ళిపోతూ, "రేయ్! ఈ జన్మలో పెళ్ళికాదు. అంతే" అంటూ శపించి వెళ్ళిపోయేడు.

గోపాలం నోట్లోవున్న వక్కపొడిని, బాబాయి పెట్టిన శాపాన్ని దిగమ్రింగి, సిగిరెట్టు ఆ సాంత వేళ్ళు కాలేదాకా తాగి క్రిందకెళ్ళి పడుకుని, తెల్లవారంగానే ప్రయాణం అయ్యేడు. శంకరం బాబాయి తొరగా ఆఫీసుకెళ్ళిపోయేడు.

పిన్ని పదే పదే చెప్పింది. ఏం అనుకోవద్దని. బాబాయి వెళ్ళగానే భోజనం కూడా పెట్టింది. నాలుగు మెతుకులు కతికి సంచి పుచ్చుకుని రోడ్డు పట్టేడు. పరధ్యానంగా రెండు రోడ్లు సర్వేచేసే సరికి పదకొండుంపావు! కెవ్వున కేకేసి ఆటోపిల్చేడు. గోపాలం ఆదుర్దా పసిగట్టిన ఆటోవాడు మీటరు కట్నంకాక అయిదు రూపాయలు లాంఛనాలు కావాలన్నాడు. గోపాలం ఆడ పిల్ల తండ్రిలా లోపలి చికాకుపడి, తిట్టుకుని పైకి మాత్రం జైల్లోపడ్డ హీరాలాగా నవ్వి, "ఇట్సాల్‌రైట్' అనిగూడా కూసి ఆటోలో ఎక్కేడు....

గోపాలం సంచీ వొళ్ళో పెట్టుకుని పంకాకి క్రిందవున్న సిమెంటు బల్లపైన ఆసీనుడయ్యేడు. హాయిగానే వుందనిపించింది. కాని పంకా పాతకాలం నాటిది కావటం చేత అశాస్త్రీయ సంగీతాన్ని దారుణంగా పాడుతోంది. విసుగ్గా తలెత్తి చూసేడు సంగీతమే కాదు డాన్స్‌కూడా చేస్తోంది. గోపాలానికి గుండె ధైర్యం తక్కువ. ప్రాణంపై తీపి ఎక్కువ. ఈ రెండు కారణాలవల్ల అక్కడ్నించి అర్జెంటుగా లేచి ఎక్కడా కూర్చోడానికి ధైర్యం చాలక పచార్లు చేస్తుండగా– ఆమెని చూసేడు.

కనకాంబరం రంగు జార్జెట్ చీర కట్టుకుంది. నల్ల జాకెట్టు, మొహం కోలగా వుంది. జుట్టు వంకలు వంకలుగా భలే ముద్దొచ్చేటట్టుంది. భుజాలు సన్నగా వున్నాయ్... గోపాలం దూరాన్నించే వీటన్నింటిని గమనించేడు. ముచ్చటపడిపోయేడు. చేతిలో దిండు సైజు ఇంగ్లీషు నవల కనిపిస్తోంది కాబట్టి చదువు గూడా వుందన్నమాట. తను ఇంతవరకు చూసిన ఆడపిల్లల్లో ఇలాంటి పడుచులేదని వుంటే ఎగిరి గంతేసి చేసుకునుండేవాడని అనుకుంటుండగా ఆమె

ఎవరో పిల్చినట్లు తలెత్తి సూటిగా, చురుగ్గా, కరుగ్గా అతడి వైపు రెండుక్షణాలు చూసి తలొంచుకుంది.

గోపాలం పచార్లు చేస్తున్నట్లే నటిస్తూ ఆమెకి వెనగ్గా వెళ్ళి రెండు క్షణాలు నిలబడ్డాడు. వీపు విశాలంగా ఎంతో మనోహరంగా వుందనిపించింది. అక్కడ్నించి కదుల్తుండగా, ఆమె వెనక్కి తిరిగి చూసి, విసుగ్గా మొహం చిట్లించీ, పమిటని నిండుగాకప్పుకుంది. గోపాలానికి థ్రిల్లుగా అనిపించింది. కాని బావుండదని ప్రొసీడయిన క్యాంటిన్లో టీ తాగేడు. సిగరెట్టు ముట్టించి, గుప్పు గుప్పున పొగవదులుకుంటూ వచ్చేసరికి ఆమె అక్కడే వుంది. కాని ప్రక్కన ఇపుడో పిల్లవాడుకూడా వున్నాడు. అతడికి పద మూడేళ్ళ వయసుంటుంది. చేతిలో చిన్న సూట్‌కేసుంది.

ఆమె అతడితో ఎంతో సన్నిహితంగా ఏదో చెప్తోంది. అతడు నవ్వుతూ వింటున్నాడు. ఆమె వుండి వుండి గోపాలం వైపు చూస్తోంది. ఆ చూపులో ఇందాకటి కరుకుదనం పోయి ప్రసన్నత్వం కనిపిస్తోంది.

గోపాలం ఓ స్తంభానికి అనుకుని నిల్చుని ఆమెని దొంగ చాటుగా చూస్తూ ఆలోచిస్తున్నాడు. మంచి సంబంధాలు కావాలంటే ఇలా రైల్వే ప్లాట్‌ఫారమ్స్ పైన, బస్సు స్టాండుల్లో సినిమా హాళ్ళల్లో డ్యూటీ ప్రకారం తిరిగితే తప్పక దొరుకుతాయన్న అభిప్రాయం బలపడుతుండగా, సరాసరి వెళ్ళి ఆ పిల్లని అడిగేస్తే ఎలా వుంటుందన్న ఆలోచనతో సతమతమవుతుండగా–

"ఎక్స్‌క్యూజ్‌మీ" అని వినబడటంతో వులికిపడి వెనక్కి తిరిగి చూసేడు.

ఆమే! నవ్వుతూ నిల్చునుంది. ఆమె వెనకే ఆ పిల్లాడు. నెత్తిన పెట్టెతో సహా.

గోపాలం కంగారు పడ్డాడు. అయినా నవ్వేడు. సిగరెట్టు జారి క్రింద పడింది. 'యస్ ప్లీజ్" అన్నాడు పొలైట్‌గా.

మీరూ లింక్ ఎక్స్‌ప్రెస్‌కోసమేనా వెయిట్ చేసేది అనడిగిందామె నవ్వుతూనే.

"యస్....యస్....లింగ్.... వెయిటింగ్ గొంతు తడారి పోయింది. గుండె వేగం హెచ్చింది.

ఆమె అందంగా నవ్వి నేనూ ఆ ట్రయిన్‌కి ఇంకా ముప్పావు గంట టైమున్నట్లుంది. షాపింగ్ పనొకటి మర్చిపోయి వచ్చేశాను. కాస్తమీరు వీడికి కంపెనీగా వుంటానంటే నేవెళ్ళి ఆ పనికాస్తా పూర్తి చేసుకు వచ్చేస్తా. సారీ... మీకేం అభ్యంతరం లేకపోతేనే...."

"నో....నో.... ఆయ్‌మీన్ యస్. యస్. అబ్బే– ఏం అభ్యంతరం వుండదు. క్షేమంగా వెళ్ళి లాభంగా రండి అనకమునుపే ఆమె తిరిగి' థాంక్స్–రేయ్ – వీరితోనే వుండు నే క్షణంలో వచ్చేస్తా– సరేనా? సారీ అండీ వచ్చేక మీకో కూల్‌డ్రింక్ తాగిస్తా... ఫర్‌ది హెల్ప్...."

"నో....నో...యస్....యస్...వో ఫార్మాల్టీస్...."

ఆమె చిన్న ఎయిర్ బ్యాగ్ చేతికి తగిలించుకున వెళ్ళిపోయింది.

గోపాలానికి తేరుకునే సరికి పది నిమిషాలు పైగా పట్టింది. ఆ పిల్లవాడు అలాగే పెట్టెని నెత్తిన పెట్టుకుని రిప్లయి కార్డులాగా ప్రక్కనే నిల్చునున్నాడు. గోపాలం కర్చీఫ్‌తో మొహం తుడుచుకుని సిగరెట్టు ముట్టించి, ఆ పిల్లాడ్ని పేరడిగాడు.

'వెంకట సుబ్బయ్య" అన్నాడతడు నెత్తిమీద లగేజీతో.

గోపాలం ఫీలయ్యేడు- అప్సరస వంటి ఆ పిల్లకి వెంకటసుబ్బయ్య తమ్ముడయినందుకు అయినా సరిపెట్టుకుని "ఆ పెట్టె ఇలా ఇచ్చి. నే పుచ్చుకుంటా" నన్నాడు.

ఆ పిల్లాడు ఆ మాటకోసమే ఎదురుచూస్తున్నట్లు టక్కున పెట్టె దింపి చేతికిచ్చేడు. అది చచ్చేటంత బరువుగా వుంది- వెంకట సుబ్బయ్య కండబలానికి అచ్చెరువోంది "కాఫీ త్రాగుతావా?" అనడిగాడు కర్టసీకి.

"ఆకలేస్తోంది" అన్నాడు వెంకటసుబ్బయ్య.

గోపాలం బుర్రలో వెంటనే రకరకాల ఆలోచన్లు- అక్కయ్యని గూడా ఆకలని తీనేసుంటాడు. అందుకే ఆమె షాపింగ్‌కని చెప్పి వీడికేదో తింటానికి తేవటానికే వెళ్ళుంటుంది. ఆమె తిరిగొచ్చేసరికి తనుగాని వీడిచేత బ్రేవ్ మనిపిస్తే ఆమె దృష్టిలో తనకెన్ని మార్కులు పడొచ్చు? సమాధానం చాలా ఎంకరేజింగా రావటం చేత,

వెంకటసుబ్బయ్యని ఓ చేత్తో, అతడాడి లగేజీ ఇంకో చేత్తో పుచ్చుకుని రైల్వే క్యాంటిన్లోకి దారి తీసేడు.

వెంకటసుబ్బయ్య మొహమాటం అస్సలున్నట్లుగా అనిపించలేదు. పేరుపేరు వరసనా పదార్థాలన్నీ అడిగి మరీ తెప్పించుకుని తిన్నాడు. పది రూపాయలు బిల్లయింది.

ఇద్దరూ బయటకొచ్చేరు. గోపాలం కిళ్ళీ షాపులో సిగరెట్టు ప్యాకెట్టు తీసుకుంటుంటే, వెంకటసుబ్బయ్య పక్కనున్న ఫ్యాన్సీ కౌంటర్లో ప్లాస్టిక్ బొమ్మ చేతిలోకి తీసుకోవటము, అది చెయ్యిజారి క్రిందపడిపోవడమూ, అది పాడయిపోవటం, షాపు వాడికి గోపాలాన్ని చూపటమూ, గోపాలం దాని ఖరీదు పదహార్రూపాయల నలభై పైసలు చెల్లించి బయటపట్టం జరిగింది.

యింతలో మైకులో ట్రయిన్ వస్తున్న ఎనౌన్స్ వినిపించడంతో, గోపాలం ఆదుర్దాగా మెట్లవైపుగా చూసేడు- ఆమె వస్తున్న జాడ లేదు.

గోపాలం ఓ క్షణం ఆలోచించేడు. వెళ్ళి టిక్కెట్టు తెచ్చుకోవటమా, ఆమె వచ్చేదాకా వెయిట్ చెయ్యటమని, రెండో పద్ధతే సబబుగా వుండటమే కాకుండా, ఒకేసారి కొనుక్కుంటే ఒకే కంపార్ట్‌మెంట్లో ట్రావెల్ చెయ్యొచ్చుగదాన్న ఆశ- అలాగే నిల్చునున్నాడు.

మళ్ళీ ఇంకో ఎనౌన్స్‌మెంటు, దాని వెనక ట్రయిన్ వచ్చి పడ్డాయ్.

ప్లాట్ ఫారంపైన సందడి పెరిగింది. గోపాలం వెంకటసుబ్బయ్యని అతగాడి దెయ్యపెట్టెని చెరో చేత్తో పుచ్చుకుని ఆత్రంగా మెట్లపైపు చూస్తున్నాడు. ఇంకా ఆమె జాడేలేదు.

గోపాలంలో కాస్త అలజడి ప్రారంభమైంది. ఆఫీసర్‌కి తనకీ రిలేషన్స్ అంతగా ఆరోగ్యకరంగా లేవు. ఈ ట్రయిన్లో గాని వెడితే రేపు సరిగ్గా ఆఫీసు వేళకి వెళ్ళగలడు. కాని....ఫ్ఛ్,

గోపాలం మళ్ళీ మెట్లవైపు చూసేడు.

కాని వెంటనే సర్ది చెప్పుకున్నాడు. ఆఫీసర్లు ఎప్పుడూ వుంటారు. కాని ఇలాంటి బంగారం లాంటి అవకాశం మళ్ళీ మళ్ళీ రమ్మంటే మాత్రం వస్తుందా? మీ కోసం ట్రయిన్‌ని కూడా త్యాగం చేస్తానండీ. ఆ పిల్ల దృష్టిలో ఎన్ని మార్కులు పడతాయ్?!

ట్రయిన్ మైక్‌లో మూడుసార్లు చెప్పించుకుని మరీ కదిలింది. గోపాలం వెళ్తున్న ట్రయిన్ వంక పరధ్యానంగా చూస్తుండగా- ఆఖరి పెట్టెలోంచి ఎవరో విండోలోంచి చెయ్యి వూపుతున్నారు- ఎవరు? ఎక్కడో చూసినట్లుగా-

గోపాలానికి గుండె ఆగినంత పనయింది-

ఆమే! నవ్వుతూ చెయ్యి వూపుతోంది– అరెరె.

"అయ్యో! అదిగో మీ అక్కయ్య" పెద్దగా అరిచేడు.

వెంకట సుబ్బయ్య పజిల్లా "ఎవరక్కయ్యా" అంటూ క్వశ్చెన్ చేసాడు.

"మీ అక్కయ్య– అలా వెళ్ళిపోయిందేమిటి? ఇప్పుడేవిటి చెయ్యటం."

"మా అక్కయ్య కాదు. అసలు నాకు అక్కయ్యల్లేరు. అంతా అన్నయ్యలే" అన్నాడు వెంకటసుబ్బయ్య.

'మరయితే అలా చెప్పిందేం? అయితే నువ్వెవరు?" చేతిలో పెట్టెని అతడికిచ్చేసాడు.

వెంకటసుబ్బయ్య పెట్టిని యాధావిధిగా తలకెక్కించి, పేరు వెంకటసుబ్బయ్య. మా నాన్న ఇక్కడ ఎలక్ట్రీషియన్-ఆ సామాన్లన్నీ ఇదిగో ఈ పెట్టెలోపెట్టి. అన్నం తినొస్తానని ఇంటికెళ్ళేడు. నేనేమో ఓ చోట కూర్చోటం ఇష్టంలేక పెట్టె నెత్తినెట్టుకుని తిరుగుతుంటే ఆవిడేమో పేరూ అదీ అడిగి ఫ్రీగా టిఫిన్ పెటిస్తా తింటావా అనడిగింది. ఓ– అన్న. అయితే నేచెప్పినట్లు చెయ్యి అంది. సరేనన్నా– అచ్చు అలాగే చెసా బ్రేవ్."

ఆ గోపాలుడి వదనం వర్ణనా తీతం.

అదీ కథ.